క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు అభిలాష ఎంపిక


అభిలాష

వింజమూరు (ఉదయగిరి): నెల్లూరు దర్గామిట్టలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీల్లో వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని యు.అభిలాష ప్రథమ స్థానంలో నిలిచారు. నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతి కింద రూ.5 వేలు అందజేశారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఈ బాలిక అర్హత సాధించడంతో పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు గొట్టిగుండాలలో గడప గడపకు మన ప్రభుత్వం

కొండాపురం: మండలంలోని గొట్టిగుండాల పంచాయతీలో శని, ఆదివారాల్లో ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిమ్మిలి రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

నేడు మండల సమావేశం

కావలి: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ ఏవీ కృష్ణమోహన్‌రావు ఒక ప్రకటలో తెలిపారు. అభివృద్ధి పనులపై సమీక్ష, ఉపాధి హామీ పథకంపై సమీక్ష, హౌసింగ్‌పై సమీక్ష, జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష, ఇతర అంశాలపై సమీక్ష ఉంటుందని వివరించారు.

3న మండల సమావేశం

ఆత్మకూరురూరల్: అక్టోబరు 3న ఆత్మకూరు మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో అజెండాలోని అంశాలతో పాటు పలు ప్రజా సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఎకో టూరిజం ప్రదేశంగా వింజేటమ్మ దేవాలయం


మధుసూదన్‌రెడ్డిని బొకే సత్కరిస్తున్న కర్నాటి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని వింజేటమ్మ కొండమీద కొలువైన గ్రామదేవత దేవాలయాన్ని ఎకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వింజమూరు వాసి ఏపీ రైతు సాధికారిక సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి స్పందిస్తూ ఏపీ అటవీ అభివృద్ధి శాఖాధికారి మధుసూదన్‌రెడ్డికి ఫోన్‌లో మాట్లాడి అవసరమైన సహాయం చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. వింజేటమ్మ దేవాలయం ఎకో టూరిజం పార్కుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం మధుసూదన్‌రెడ్డిని కలిసి బొకే అందజేశారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


ప్రాథమిక వైద్యం చేస్తున్న 108 సిబ్బంది

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మర్రిపాడులో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. మండలంలోని రామానాయుడుపల్లికి చెందిన తలచీరు హజరత్తయ్య మర్రిపాడు పోలీసుస్టేషన్ సమీపంలో డైవర్షన్ రోడ్డు దాటుకుని వెళ్తుండగా బద్వేల్ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని 108 వాహనంలో ఆత్మకూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా పరీక్షలు

ఉదయగిరి: మండలంలో ఈ నెల 24న అక్షర చైతన్య కేంద్రాల్లోని అభ్యాసకులకు జరిగే పరీక్షలను అబ్జర్వర్లు, ఇన్విజిలేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, ఎంఈఓ టి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో 17 అక్షర చైతన్య కేంద్రాల్లో 330 మంది వయోజన అభ్యాసకులకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యాసకులు పరీక్షలకు హాజరయ్యేలా వలంటీర్లు చూడాలన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాలన్నారు. ప్రశ్నపత్రాలను భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ అలీం, సీఏ వసీం తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ భిక్షపెట్టిన అన్నపైనే విమర్శలా?


మాట్లాడుతున్న బాలగురవారెడ్డి


మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి


మాట్లాడుతున్న రవీంద్రారెడ్డి

వరికుంటపాడు: ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి స్వయంకృపరాధంతో రాజకీయంగా పతనమై తన ఎదుగులకు కారణమైన ఆయన సోదరులు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డిపై విమర్శలు చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆంధ్రా బాలగురవారెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెద్దలు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆశీసులతోనే ఇన్నీ రోజులు చంద్రశేఖరరెడ్డి రాజకీయాల్లో మనుగడ సాధించి రాణించగలిగారన్నారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మేకపాటి కుటుంబాన్ని, నమ్ముకున్న నియోజకవర్గ ప్రజలను, కుటుంబ పెద్దలను కాదని ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసినప్పుడే ఆయన రాజకీయంగా నైతిక విలువలు కోల్పోయాడన్నారు. నియోజకవర్గ ప్రజలను కనిపెట్టుకుని ఉండి, అభివృద్ధికి పాటు పడుతున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డిపై అభాండాలు వేయడం, టీడీపీ నాయకుల అండ చూసుకుని వైఎస్సార్‌సీపీ నాయకులను తన నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. రాజమోహన్‌రెడ్డి ప్రతిష్టను తగ్గించడానికి ప్రయత్నిస్తే మిమ్ముల్ని నియోజకవర్గ ప్రజలు క్షమించరన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ దేవన బోయిన మధు, మాజీ జెడ్పీటీసీ బోగినేని శ్రీనివాసులు, మాజీ మండల కన్వీనర్లు గంగవరపు పుల్లయ్య, గుంటుపల్లి నాగభూషణం, మాజీ సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, నాయకులు బత్తిన రాజేంద్ర, ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, కొండయ్య, నాగిరెడ్డి, బి.వెంకటరెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చౌకబారు విమర్శలు చేస్తే సహించం

దుత్తలూరు: తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాల్లో మేకపాటి కుటుంబానికి ప్రత్యేక స్థానం సంపాదించిన మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి చౌకబారు విమర్శలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి తెలిపారు. దుత్తలూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డిల భిక్షతోనే నాలుగు సార్లు ఎమ్మెల్యే గెలిచిన సంగతి మరువరాదన్నారు. వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచి టీడీపీకి అమ్ముడుపోయి ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి అనుకులంగా ఓటు వేసి మాయని మచ్చ తెచ్చుకున్నారన్నారు. పార్టీకి, కుటుంబానికి వెన్నుపోటు పొడిచి చరిత్ర హీనులుగా నిలిచిపోయారన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ తుమ్మల వెంగయ్య, సర్పంచ్ పెద వెంగయ్య, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు శ్రీహరినాయుడు, రామిరెడ్డి, విజయ్‌రెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, బాలాజీ, మధుసూదన్‌రెడ్డి, వెంగళరెడ్డి, నాగార్జున్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, రాముడు, వెంకటేశ్వరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు వత్తాసు పలకడం విడ్డూరం

కలిగిరి: ప్రజాధనం దోచుకున్న టీడీపీ అధినేతకు ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి తెలిపారు. కలిగిరిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొన్నటి వరకు 420, 840 అంటూ చంద్రబాబు చేసిన అవినీతి పనులను ఎండగడుతూ వచ్చిన ఎమ్మెల్యే మేకపాటి హఠాత్తుగా మాట మార్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కక్ష పూరితంగా అరెస్ట్ చేయించారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం జగనన్న ఆధ్వర్యంలోనే ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలిచారన్న విషయం మరిచిపోరాదన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, మండల యూత్ కన్వీనర్ కోడూరు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొర్రా మస్తాన్ రెడ్డి, స్థానిక నాయకులు చుండి మనోహర్‌రెడ్డి, యలపల తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

45 ఏళ్ల అభిమానానికి సత్కారం


చింతాల వెంకట్రావును సత్కరిస్తున్న చిరు అభిమానులు

కావలి: పద్మభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి సినీ ప్రస్థానం 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా చిరంజీవి అభిమాన సంఘాల నాయకుడు చింతాల వెంకట్రావును కావలిలోని ఆయన కార్యాలయంలో చిరు అభిమానులు సన్మానించారు. కృషి, పట్టుదలకు చిరంజీవి మారు పేరని, ఆయన అభిమానులమని చెప్పుకునేందుకు ఎంతో గర్వంగా ఉందని అభిమానులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిమాన సంఘాల నాయకుడు కొట్టే వెంకటేశ్వర్లుతో పాటు కావలి అభిమాన సంఘాల నాయకులు అలా శ్రీనాథ్, వెంకయ్య, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు


రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు మారుతీదేవి

అల్లూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలను సాగు చేయడం ద్వారా మంచి ఫలితాలను పొందుతారని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు సి.మారుతీదేవి తెలియజేశారు. మండలంలోని ఇందుపూరు ఆర్బీకేలో శుక్రవారం ఆత్మ సౌజన్యంతో రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిరు ధాన్యాల్లో ఇనుము, కాల్షియం, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు అధికమన్నారు. వీటిలో ఉండే పోషకాలు శరీరానికి చాలా మేలు చేస్తాయన్నారు. మన ఆరోగ్యాన్ని కాపాడతాయన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో చిరుధాన్యాలని సాగు చేసుకోవాలని, వాటి సాగు వివరాలను వివరించారు. మట్టి పరీక్షలు కచ్చితంగా చేయించుకోవాలని వాటి ఫలితాలు ఆధారంగా ఎరువులు మోతాదు నిర్ణయించుకుని ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. వరిలో ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణ, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్.లోకేష్‌బాబు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజాకుమారి, ఏఓ వి.అశోక్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

దొరసానమ్మ గంధమహోత్సవానికి ఏర్పాట్లు


గంధమహోత్సవానికి సిద్ధమైన హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని పవిత్ర పుణ్యక్షేత్రం హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో దొరసానమ్మ గంధమహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా ఈఓ హుస్సేన్ తెలిపారు. మొదటి సారిగా చిన్న గంధమహోత్సవానికి వక్ఫ్‌బోర్డు శనివారం అర్ధరాత్రి గంధం పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామన్నారు. దర్గా ప్రాంగణంలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు క్యూలైన్లలోనే అమ్మ వారిని దర్శించుకోవాలన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి


ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

ఆత్మకూరు: ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనాలు చెల్లించాలని నియోజకవర్గంలోని అన్ని మండలాల అంగన్‌వాడీల నిర్వాహకులు కోరారు. శుక్రవారం ఆత్మకూరులో ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ప్రదర్శన నిర్వహించి, ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుభద్రకు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ నిర్వాహకులు రాధమ్మ, లక్ష్మి, సీఐటీయూ కార్యదర్శి హజరత్తయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల వేతనాలు ఇచ్చిన హామీ మేరకు పెంచలేదని, 2017 నుంచి రావాల్సిన టీఏ బిల్లులు, వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర అంగన్‌వాడీల యూనియన్ పిలుపు మేరకు రెండు రోజుల పాటు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నిర్వాహకులు టి లక్ష్మి, జి నాగమణి, రమణమ్మ, కే విజయమ్మ పాల్గొన్నారు.

కాలువ పోరంబోకు భూములను కాపాడండి


విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని సర్వే నంబరు 898లో కాలువ పోరంబోకు భూమి కొంత మేర ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయించారని, ఆ భూమిని గుర్తించి స్వాధీనం చేసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సీపీఎం నాయకులు లక్ష్మీపతి, లక్కు ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ 898 సర్వే నంబరులోని 90 సెంట్ల భూమికి సమీపంలో ప్లాట్లు వేసిన వ్యక్తి ఆ భూమిని తన సొంత భూమిగా కలుపుకుని ప్లాట్లు విక్రయించారన్నారు. ఈ విషయమై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించి కలెక్టర్‌కు నివేదికలు ఇచ్చారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు ఆర్డీఓకు ప్రొసీడింగ్స్ ఇటీవల అందాయని, వెంటనే పరిశీలించి ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓపెన్ చెస్ పోటీలు రేపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నవాబుపేటలోని కేపీఆర్ కల్యాణ మండపంలో ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలను ఆదివారం ఉదయం నిర్వహించనున్నామని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కీడాకారులకు ఉచిత భోజన వసతిని కల్పించనున్నామన్నారు. దేశ వ్యాప్తంగా 300 మంది అగ్రశ్రేణి క్రీడాకారులతో పాటు ఫిడే టైటిల్ ప్లేయర్స్ తమ పేర్లను నమోదు చేసుకున్నారని వివరించారు. ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 91456 29999 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన పెంచాలి


జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించేందుకు చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు కృషి చేయాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని కరటంపాడులో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంకయ్య, ఏఎన్ఎం శివకుమారి, సచివాలయ కన్వీనర్ రఫీ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పాటించకుంటే జరిమానా

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి పంచాయతీలో వీధి కాలువల్లో చెత్తా, చెదారం వేస్తే జరిమానా విధిస్తామని గ్రామ పంచాయతీ అధికారులు ప్రకటించారు. గ్రామంలోని పలు వీధుల్లో ఈ మేరకు దండోరా వేయించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలోని చెత్తను ఒకే చోట పోగు చేసుకుని, తరచూ గ్రామ శివార్లకు తరలించుకోవాలని దండోరా వేయించారు. లేని పక్షంలో గ్రామ పంచాయతీ జరిమానా విధిస్తారని తెలిపారు.

అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు


చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వరికుంటపాడు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రత్యేక చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అన్వేష్, కరీష్మా వైద్య పరీక్షలు నిర్వహించారు. వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు లేని 11 మంది చిన్నారులను గుర్తించి వారికి స్క్రీనింగ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లల ఎత్తులు, బరువులు ప్రతి నెలా చూసి రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. పోషకాహార లోపం ఉన్న చిన్నారులకు అదనపు పోషకాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి అంగన్‌వాడీ ప్రాజెక్ట్ అధికారిణి పచ్చవ లావణ్య, పీహెచ్ఎన్ సుశీలమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు ఇ.వెంకటయ్య, సహాయకులు వై. శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

నెల్లూరు (టౌన్): దేశం కోసం పాటుపడిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పొణకా కనకమ్మ, దువ్వూరి రామిరెడ్డి వర్ధంతి సభలో ఆమె మాట్లాడారు. మహిళా విద్య కోసం పొణకా కనకమ్మ ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం పొణకా కనకమ్మ, దువ్వూరి రామిరెడ్డి, బేరమ్మ చిత్రపటాలను కళాశాల యాజమాన్యానికి అందజేశారు. పొణకా కనకమ్మ ఆశయసాధన సమితి, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ గిరి, తెలుగు భాషోద్యమ సమితి కోశాధికారి భాస్కర్ రెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కోఆర్డినేటర్ లక్ష్మీ సునంద, సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజు క్రీడాకారుల ఎంపికలు


ఖోఖో ఆడుతున్న అండర్‌-14, 17 బాలికలు

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంత క్రీడా విద్యార్థుల ప్రతిభను గుర్తించడంతో పాటు వారికి ఉజ్వల భవిష్యత్ కల్పించేందుకు నిర్దేశించిన ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపికలు రెండో రోజు శుక్రవారం కొనసాగాయి. ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్‌–14, 17 విభాగాల్లో సుమారు 210 మంది విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరయ్యారు. ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ, తదితర క్రీడాంశాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నియోజకవర్గ కో ఆర్డినేటర్ తిరుపతయ్య, డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వీరు మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకుని క్రీడల్లో పాల్గొంటే విజయం సాధించడం సులభమన్నారు. ఆ దిశగా విద్యార్థులు, వ్యక్తిగత సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన విజేతలకు నెల్లూరులో 25వ తేదీ నుంచి జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ అనంతలక్ష్మి, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ సురేష్, గౌరి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు ఆత్మకూరు చిన్నారులు


అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికైన చిన్నారులతో కరాటే మాస్టర్లు

ఆత్మకూరురూరల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు చిన్నారులు అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యారని కరాటే మాస్టర్లు ధనూష్, వాసు, హుస్సేన్ శుక్రవారం తెలిపారు. కినే షిటో రియో అనే కరాటే ఆర్ట్స్‌కు సంబంధించి బెంగళూరులోని సోమిశెట్టి కల్యాణ మండపంలో కరాటే టోర్నమెంట్ నిర్వహించగా మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన తమ చిన్నారులు అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. హర్షిత్ 1వ స్థానం, రిత్విక 2వ స్థానం, వంశీ, సునీత్‌కుమార్, వాసి నిఖిల్ 3వ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. ఈ ఐదుగురు త్వరలోనే ఖాట్మాండులో జరిగే అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు


వింజమూరులో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం రెండో రోజు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్‌–14, అండర్‌–17 విభాగాల్లో బాలబాలికలకు యోగా, కబడ్డీ, వాలీబాల్‌లో పోటీలు జరిగాయి. నియోజవర్గంలోని 52 ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయిలో ఈ నెల 25న జరిగే పోటీలకు న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాలకొండయ్య, పీడీలు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, వి.కృష్ణ, ఎం.తిరుపాల్‌రెడ్డి, అంజయ్య, సుమలత, మాచర్ల, ప్రసాద్, రజనీ విలాషిని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ


పాఠశాలకు కంప్యూటర్‌ను వితరణగా అందజేస్తున్న శేషారెడ్డి

సంగం: మండలంలోని తరుణవాయి జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, కాంట్రాక్టర్ శేషారెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.25 వేలు విలువ చేసే కంప్యూటర్‌ను శుక్రవారం వితరణగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పాఠశాలను మరింత అభివృద్ధి చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. పాఠశాలలో ప్రతిభ కనబరిచిన 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు రూ.32 వేలు నగదును ప్రోత్సాహకంగా అందజేశారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనోత్సవం


నిమజ్జనోత్సవానికి తరలుతున్న సంగం శివాజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడు


మర్రిపాడులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఐదు రోజులుగా పూజలు అందుకున్న గణనాథుడి విగ్రహాలను భక్తులు, చిన్నారులు, యువకులు కోలాహలం మధ్య శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. మర్రిపాడు కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న విఘ్నేశ్వరుడిని ప్రతిమల వద్ద ఉట్టి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. అనంతరం మేళతాళాలు, బాణసంచా మోతలతో స్వామి వారి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

కోలాహలంగా ఉట్టి మహోత్సవ వేడుకలు

ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు శుక్రవారం కోలాహలంగా ముగిశాయి. ఐదు రోజులుగా పూజలందుకున్న గణనాథుడికి ఆయా గ్రామాల్లో ఉట్టి మహోత్సవాలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. బాలబాలికలు, యువతీ, యువకులు, చిన్నారులు కేరింతలు కొడుతూ డ్యాన్స్‌లు వేసి స్వామి విగ్రహాలను నిమజ్జనానికి సాగనంపారు.

కోలాహలంగా నిమజ్జనం

చేజర్ల (సోమశిల): అనంతసాగరంలోని పలు గ్రామాల్లో ఐదో రోజు వినాయకుడి పూజలు నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. పాతాళపల్లిలో శుక్రవారం మేళతాళాలు, బాణసంచా సందడి, యువత కేరింతలతో గ్రామోత్సవం జరిగింది. మొదట వినాయకుడికి పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. లడ్డూ వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన మునమాల ఓబుల్‌రెడ్డి రూ.30 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిజివేముల ఓబుల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవాలు

సంగం: వినాయకచవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువై ఐదు రోజులుగా విశేష పూజలు అందుకున్న గణనాథుల ప్రతిమలను శుక్రవారం నిమజ్జనోత్సవాలకు తరలించారు. గణనాథుడి విగ్రహాలను గ్రామంలో ఊరేగింపుగా యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ నిమజ్జనోత్సవాలకు తరలించారు. వినాయక నిమజ్జనోత్సవాలు రాత్రి వరకు సాగడంతో సంగం సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి తమ సిబ్బంది భద్రతా చర్యలు తీసుకున్నారు. సంగం శివాజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి చేసిన పూల అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.


కావలి: రామూర్తిపేట వద్ద ఉన్న వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

నిమజ్జనానికి తరలిన గణనాథుడు

వరికుంటపాడు: మండలంలోని యర్రంరెడ్డిపల్లెలో వినాయక చవితి సందర్భంగా కొలువైన గణనాథుడిని శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి సమీపంలోని నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు.

ఐదో రోజు గణనాథుల నిమజ్జనం

కావలి: పట్టణంలోని పలువీధుల్లో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథులు ఐదో రోజు శుక్రవారం నిమజ్జనానికి తరలి వెళ్లాయి. ఇప్పటికే పలు చోట్ల మూడో రోజు నిమజ్జనం పూర్తి చేయగా, పూజలు చేసే సౌలభ్యం ఉన్న ప్రాంతాల్లోని విగ్రహాలను ఐదో రోజు, ఏడో రోజు కూడా తరలిస్తారు. పట్టణంలో పలు చోట్ల వినాయక విగ్రహాలు నిమజ్జనానికి ఊరుగింపు చేయడంతో సందడి నెలకొంది.

ఘనంగా పోలీస్ క్వార్టర్స్ గణేశ్ లడ్డూ రూ.25 వేలు

ఆత్మకూరు: ఆత్మకూరులోని పోలీస్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహానికి శుక్రవారం రాత్రి నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన గణేషుడి విగ్రహం వద్ద ఉంచిన లడ్డూకు వేలం నిర్వహించగా ఏఎస్‌పేట పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న సీహెచ్ వెంకట్రావు, వెంకటేశ్వరమ్మ దంపతులు రూ.25 వేలకు దక్కించుకున్నారు. మధ్యాహ్నం ఆత్మకూరు డీఎస్పీ ఎన్.కోటారెడ్డి, సీఐ జి వేణు, ఎస్సైలు కె.ముత్యాలరావు, బి రాజేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ అన్నదానం నిర్వహించారు.